అంతా కోలాహలం.

అప్పుడే ఖాళీబ్యాగ్‌తో మార్కెట్‌లో అడుగు బెట్టిన నాకు అసలు ఏం కొనాలో, నా అవసరం ఏమిటో అర్థంగాని పరిస్థితి.

ఎటుచూసినా వంకాయలు... టొమాటో... కాకరకాయలు... లేత బెండకాయలు... పచ్చి మిర్చి అని అరుపులేకానీ యింకొకటి వినబడడం లేదు.

నా ఎదురుగుండా ఒక పెద్ద బ్లాక్‌బోర్డు. "రైతు బజార్" కూరగాయల ధరలు అని హెడ్డింగ్‌తో వివిధ కూరగాయల ధరల పట్టిక.



# ఆకలి

ఎందుకో బ్లాక్ బోర్డు చూడగానే నాకు చిన్నగా నవ్వు వచ్చింది. వృత్తిపరంగా టీచర్నైన నాకు బ్లాక్‌బోర్డుతో వున్న సంబంధం విదితమే.

యింతలో "సారూ... లేత తోటకూర... రూపాయికి ఏడు... నీకు ఎనిమిదిస్తా. రా..." అన్న పిలుపుకి వెనక్కి చూసాను. నాకు సుపరిచిత ముఖమే. ఆమె దగ్గరే నేను ఆకుకూరలు కొంటాను వారం వారం. నేను ముందుకడుగేసాను నవ్వుతూ.

"ఐదు రూపాయలవివ్వు" అన్నాను. యిక నేను నెమ్మదిగా జనాన్ని ఛేధించుకుంటూ మార్కెట్ మధ్యలోకి వెళ్ళాను. నాకు కావలసిన కాయగూరలు చకచక కొంటున్నాను. బ్యాగ్ సగం నిండిపోయింది. బరువుగా అడుగులు వేస్తూ యింకా కొనవలసినవి ఏమి ఉన్నాయో చూస్తున్నాను.

మా ఊరు చిన్నది కావడం వలన నాకు చాలామంది తెలిసినవారే కనిపిస్తున్నారు. యీ లోపల మైక్‌లో ఆనాటి కూరగాయల ధరల పట్టిక ఎనౌన్స్‌మెంట్ జరుగుతోంది. తెలిపిన ధరలకన్నా ఎక్కువ ధరలకి కూరగాయలు అమ్మితే తమకు ఫిర్యాదు చేయమని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ఆ రోజు నిర్ధేశించిన ధరలకన్నా ఎక్కువ ధరకి అమ్మితే శిక్షిస్తామని కూరగాయలమ్మే వారినీ హెచ్చరిస్తున్నారు.

అది వింటుంటే నాకు ఎందుకో నవ్వు వచ్చింది. మారుమూల గ్రామాల నుంచి కాలినడకన వచ్చి కూరలమ్మి పొట్ట పోషించుకుందామనుకునే వారి మీద ఇన్ని నిబంధనలు... అడ్డంకులు... అదే ఊళ్ళో పెద్ద కూరగాయల మార్కెట్‌లో గంటగంటకీ ధరలు మార్చి అమ్ముతుంటే ఎవ్వరూ పట్టించుకోరు.

దొంగ తూకాలు ఇక సరేసరి.. అడిగే నాధుడే లేడు. రైతుబజార్‌లో కూరలమ్మే సన్నకారు రైతులంటే చిన్నచూపు... చట్టం... నీతి, నిజాయితీ... అన్నీ వీరికే వర్తింపచేస్తారు. అణుకువగా వున్న వాడి మీదే మొట్టికాయలు వేస్తారు.

ఒకపక్క సంచి బరువు, ఇంకోపక్క నా చెంపల మీద కారుతున్న చెమట... అడుగుతీసి అడుగువేయలేనంత జనం. కొందరు నా భుజాన్ని "ఢీ"... కొట్టి వెళ్ళిపోతున్నారు. ఢీ కొట్టి కనీసం 'సారీ' చెప్పకపోయినా వెనక్కి తిరిగి... "చూడలేదు" అని కళ్ళతో చెప్పే సంస్కారం కూడా లేదు చాలామందికి. అలా నిర్లక్ష్యంగా వెళ్ళిపోతున్న వాడ్ని పిలిచి లాగి లెంపకాయ కొట్టాలనిపిస్తుంది నాకు.

ఒకచోట ఆగాను. బరువైన బ్యాగ్ పక్కన పెట్టి, దొండకాయలు ఏరుదామని వంగాను. నా ఫ్యాంట్ కుడిజేబు దగ్గర ఎవరివో వేళ్ళ కదలిక అనిపించింది. నేను సర్రున వెనక్కి తిరిగి నా జేబుదగ్గర చెయ్యివేసి గట్టిగా పట్టుకున్నాను. వెనక్కి తిరిగి చూసేసరికి నా చేతిలో ఒక చిన్న లేత చెయ్యి నలుగుతోంది. నేను తలఎత్తి చూసాను.

ఒక అమ్మాయి... పన్నెండు... పద్నాలుగేళ్ళు ఉంటాయి. భయం భయంగా నన్ను చూస్తూ నా చేతిలోంచి తన చేతిని లాక్కోవడానికి ప్రయత్నం చేస్తోంది. అందుకుగాను

**రాగంపూడి శ్రీనివాస్**

నా చేతిలో వున్న తన చేతిని ఇంకో చేత్తో గట్టిగా లాక్కొంటోంది.

"వదులు... సార్... తప్పయిపోయింది... వదులు సార్" అంటూ గింజుకుంటోంది. కళ్ళతో ప్రాధేయపడుతోంది. ఆమె లేత మొహం చూస్తుంటే నాకెందుకో జాలి కలుగుతోంది.

దృఢమైన నా అరచేతిలో ఆమె చేతివేళ్ళు, నా మనీపర్స్ బందీగా ఉన్నాయి. నాకు నెమ్మదిగా పరిస్థితి అర్ధమయ్యింది. అప్పటికే జనం మా చుట్టూ గుమిగూడిపోయారు. అందరూ నన్ను వింతగా, తదేకంగా చూస్తున్నారు.

పరిస్థితి అర్ధమయ్యి నేను ఇంకా నోట మాటలేని స్థితిలో ఉన్నాను. ఒక ఆడపిల్ల పర్స్ కొట్టేసే ప్రయత్నం చేయడం నన్ను దిగ్భ్రాంతుణ్ణి చేసింది.

యింతలో జనంలోంచి "ఆమె చెయ్యి వదులు"... అని అరిచాడు ఎవడో.

ఆమె చేతిని వదిలేసాను.

నా పర్స్ ఇంకా ఆమె చేతిలోనే వుంది.

నేను తేరుకుని అచేతనంగా ఆమెనే చూస్తూ "ఆమె నా పర్స్ కొట్టేసింది" అన్నాను కాస్త కటువుగా.

నా మాటలని సమర్ధించుకోవడానికి నేను పెద్దగా ప్రయత్నం చేయక్కర్లేదు. ఎందుకంటే నా పర్స్ ఆమె చేతిలో వుంది.

యింతలో ఒక వ్యక్తి టకీమని పర్స్ ఆమె చేతిలోంచి లాక్కుని, "తీస్కోండి సార్... ఇది దొంగది. చిల్లర దొంగతనాలు చేస్తాది" నా పర్స్ నాకిచ్చాడు.

ఈ లోపల ఇంకొకరు "పోలీసుని పిలవండి" అన్నారు.

నేను పర్స్‌ని గట్టిగా పట్టుకుని ఆమెనే చూస్తున్నాను ఆమె కళ్ళు భయంతో రెపరెపలాడుతున్నాయి.

ఆమె బిత్తర చూపులు, ఇంకొక పక్క స్త్రీ సహజ సిగ్గు స్పష్టంగా కనబడుతోంది... భయం... భయం... పైగా బక్క శరీరం... వణికిపోతోంది.

చుట్టూ జనం... మరికొంతమంది కొత్త జనం.

జేబుదొంగ మొహం ఎలా వుంటుందో అని ఆరాటంగా చూసేవారు... అందులో ఒక ఆడది పర్స్ కొట్టేసింది అంటే ఇంకా ఆసక్తి.

కొందరు నన్ను సానుభూతిగా చూస్తూ "ఏమైంది సార్"... అంటున్నారు. పోలీస్ రానే వచ్చాడు. "ఏమైంది... ఏమైది" అనుకుంటూ.

నన్ను చూపిస్తూ "ఆ సార్... పర్స్ ఈమే లేపేసింది... ఆ సార్ ఆమెని పట్టుకున్నాడు... అన్నారు ఒకరు.

"దాన్ని తీస్కోపోండి సార్... అది జేబుదొంగ. అంటూ మరికొందరు...

"ఏం సార్... ఆమె మీ పర్స్ కాజేసిందా?" పోలీస్ నన్ను దీర్ఘంగా చూస్తూ అన్నాడు.

నేను మౌనంగా ఉన్నా. చుట్టూ ఉన్నవారు "అవును సార్... ఆమెనే అతని జేబు కొట్టేసింది..." అన్నారు.

అంతేగాక ఒక్కొక్కరు తలో మాట...

నేను అవన్నీ ప్రేక్షకుడిలాగ వింటున్నా నా కళ్ళు ఆమెని పరీక్షిస్తున్నాయి.

పూర్తిగా వాడి పోయిన ముఖం. ఆ మొహంలో లేతదనం సరైన పోషణలేని జుట్టు, పాలిపోయిన బుగ్గలు, కళ్ళు పెద్దవైనా గుంత

కళ్ళలాగ కృూనిపిస్తున్నాయి.

ఆ పిల్ల కళ్ళలోంచి ధారావాహికంగా కన్నీళ్ళు కారుతున్నాయి. ఆ జనం... ముఖ్యంగా పోలీసుని చూస్తుంటే కాబోలు ఆమెకి భయంగా ఉంది.

ఇదంతా ఒక ఎత్తు అయితే... జనంలో ఒక్కొక్కరూ తలో విధంగా ప్రేలే ప్రేలాపన తప్పక ఆమెని బాధిస్తున్నాయి.

ఇంతలో మైక్‌లోంచి ఒక ఎనౌన్స్‌మెంట్...

"కూరగాయలు కొనేవారికి విజ్ఞప్తి. మీ యొక్క ధనము మరియు ఇతర విలువైన వస్తువులను జాగ్రత్తగా చూసుకొనవలయును. జేబుదొంగలు తిరుగుతున్నారు."

ఆ ప్రకటన విని అందరూ నవ్వారు.

ఆ ప్రకటన విని పోలీస్ యింకా రెచ్చిపోయి, "రావే... స్టేషన్‌కి... అక్కడ తేలిద్ధి నీ కత..." అంటూ ఆమె జుత్తు చేత పుచ్చుకున్నాడు.

ముందుకు తూలింది ఆ అమ్మాయి. గొల్లున ఏడుస్తోంది.

నాకెందుకో ఆమెని చూస్తుంటే నా కూతురు గుర్తుకొచ్చింది.

నా కూతురికి కూడా సుమారు ఆ పిల్ల వయస్సే వుంటుంది.

ఎంత తేడా... నా కూతుర్ని నేను ఒక చిలకలాగా పెంచుకుంటున్నాను. అది ఏడిస్తే నేను ఏడుస్తాను. అది నవ్వితే నేను నవ్వుతాను. బాధ, దుఃఖం, కష్టం... ఆకలి... తెలియకుండా పెంచుకుంటున్నాను.

కాని ఈ పిల్లకి... నా కూతురికి ఎంత వ్యత్యాసం. మౌనంగా వున్న నాకో సమాధానం దొరికినట్లు అనిపించింది. "ఆకలి... ఆకలి..." అదే అన్నిటికీ కారణం.

తల్లిదండ్రుల పోషణలేక ఆకలి తట్టుకోలేక... వచ్చే తెగింపే ఈ పిల్లకి వచ్చింది. ముక్కుపచ్చలారని పిల్లకి దొంగతనం చేయడం, అందులోనూ జేబులో పర్స్ కొట్టేయాలనే ఆలోచన రావడం ఒక విపరీతం. ఆ విపరీతానికి మూలమే "ఆకలి".

నాకెందుకో ఆ పిల్ల మీద వున్న ఆలోచనలు ఒక్కసారిగా "జాలి, సానుభూతి" గా మారాయి.

ఆమె చేసిన దానికి ఆమె శిక్షార్హురాలా?

ఎందుకో కాదనిపించింది.

"ఆగండి..." కాస్త గట్టిగానే అన్నాను.

కాస్త నిశ్శబ్దం ఆవరించింది.

పోలీస్‌ని ఉద్దేశించి "ఆమె జుత్తు వదిలేయండి"

"ఆమె నీ జేబు కొట్టేసింది..."

"అలా అని నేను కంప్లైంట్ చేయలేదు..." కాబట్టి ఆమెని వదిలేయండి.

పోలీస్ నన్నే చూస్తూ ఆమె జుత్తు వదిలేసాడు.

అందరూ నన్ను ఎగాదిగా వింతగా చూస్తున్నారు.

నేను జేబులోంచి పర్స్ తీసి అందులోంచి "వందరూపాయలు" తీసి ఆ అమ్మాయి చేతిలో పెట్టాను. ఆర్ద్రత నిండిన కంఠంతో -

"రెండు పూటలైనా కడుపునిండా అన్నం తిను" అన్నాను.

బాధతో నిండిన మనస్సుతో బ్యాగ్ అందుకుని వడివడిగా నడిచాను. ●